క్లుప్తంగా

వృద్ధులకు వైద్య పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ విద్యాసాగర్

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శుక్రవారం 'వైఎస్సార్ కంటివెలుగు' పథకం ద్వారా వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండు పాపల, ఉమాపతినగర్ గ్రామాల్లో డాక్టర్లు విద్యాసాగర్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 122 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. 19 మందికి కంటి ఆపరేషన్లు చేయాల్సి ఉండటంతో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు వీరభద్రుడు, గిరిజ, ఖాజాబీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చండి


విద్యార్థులను సన్మానించిన దృశ్యం

బేతంచెర్ల: విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని ఎంఈఓ సోమశేఖర్, వాసవీ క్లబ్ రీజనల్ చైర్ పర్సన్ రాజేంద్ర,జోన్ చైర్ పర్సన్ ధనుంజయ సూచించారు. శుక్రవారం స్థానిక అమ్మవారిశాల్లో వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బళ్లాని సూర్య, గుప్త ఆధ్వర్యంలో మండలంలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా గోపా లు, వాసవీ క్లబ్ క్యాబినెట్ కార్యదర్శి సతీష్, సభ్యులు కంద గడ్డల మోహన్, లక్ష్మినారాయణ, విష్ణు, జనార్దన్, సుధీర్ పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనుల పరిశీలన


ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ రాజేష్

డోన్ : స్థానిక వైఎస్ఆర్ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఈఎల్ఎస్ఆర్ ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ సప్త శైల రాజేష్ పరిశీలించారు. మూడు నెలల్లో పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు చైర్మన్ సూచించారు. ఇప్పటికే వైఎస్ నగర్, శ్రీరామ్‌నగర్, టీఆర్ నగర్ పరిధిలో 5.5 కిలోమీటర్ల మేర పైపులైన్ పనులు పూర్తయినట్లు చైర్మన్ చెప్పారు. ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం పూర్తికాగానేపై ప్రాంత ప్రజలందరికీ మంచి నీటి సౌకర్యం ప్రతిరోజు కల్పించే అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈలు జనార్దన్, ఇతేష్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏ మృతి


ప్రభుత్వం తరపున దహన సంస్కారాలకు రూ.25వేలు అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని పండ్లాపురం గ్రామ వీఆర్ఏగా పని చేస్తున్న చిన్న బాలన్న (67)శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. నంద్యాల జిల్లా వీఆర్ఏల సంఘం అధ్యక్షులు నాగేష్, మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు బాలన్న చిన్నబాలన్న ఇంటి వద్దకు వెళ్లి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున మృతుడి కుటుంబ సభ్యులకు రూ.25వేల ఆర్థిక సాయాన్ని సినియర్ అసిస్టెంటెంట్ పుల్లయ్య చేతుల మీదుగా అందజేశారు. అలాగే వీఆర్ఏల సంఘం తరపున మరో రూ.5వేలు ఇచ్చారు.

స్టేట్ బ్యాంక్ మేనేజర్‌గా సుదర్శన్ రావు



ప్యాపిలి: స్థానిక స్టేట్ బ్యాంకుకు బదిలీపై వచ్చిన మేనేజర్ సుదర్శన్ రావు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న వెంకటేశ్వర్లు కర్నూలుకు బదిలీ అయ్యారు. ఒంగోలు నుంచి ఇక్కడికి వచ్చిన సుదర్శన్ రావును సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. స్టేట్ బ్యాంకు వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని ఈ సందర్భంగా మేనేజర్ తెలిపారు.

జగనన్న విద్యాకానుక సిద్ధం!

- 12న ప్రారంభం కానున్న స్కూళ్లు
- మొదటిరోజే విద్యాకానుక కిట్ల పంపిణీకి చర్యలు చేపట్టిన అధికారులు


బనగానపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భద్రపరిచిన పాఠ్యపుస్తకాలు

నియోజకవర్గంలో మండలాలవారీగా ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు పాఠ్యపుస్తకాల ఇండెంట్ వివరాలు

మండలం	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థులు	పుస్తకాల ఇండెంట్
బనగానపల్లె	79	10,260	1.15,187
అవుకు	49	4638	52.372
కొలిమిగుండ్ల	59	4756	53,023
సంజామల	43	3598	40.576
కొవెలకుంట్ల	36	4164	46,368

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. విద్యార్థులకు సకల వసుతులు సమకూర్చుతుంది. 'మన బడి నాడు–నేడు' పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసింది. విద్యార్థినీ, విద్యార్థులకు అనుగుణంగా కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మౌలిక వసతులు కల్పించింది. అదేవిధంగా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టింది ప్రభుత్వం. పిల్లలను బడికి పంపే ఏ తల్లీ ఆర్థికంగా ఏ మాత్రం ఇబ్బంది పడకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమ్మఒడి అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇంగ్లిష్ విద్యాబోధననూ అమలు పరచడం జరిగింది. ప్రభుత్వ చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. అందుకు ఇటీవల వెలువడిన పదవ తగరతి ఫలితాలే నిదర్శనం. యేటా పాఠశాలలు తెరచిన రోజే జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్న ప్రభుత్వం ఈ ఏడూ కొనసాగిస్తుంది. స్కూళ్లు తెరిచిన రోజే జగనన్న కానుక పంపిణీ చేసేందుకు యంత్రాంగం సర్వం సిద్ధం చేశారు. బనగానపల్లె నియోజకవర్గంలో 266 ప్రభుత్వ ఉన్నత, యూపీ, ప్రాథమిక పాఠశాలలు ఉండగా 27,416 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు 3,07,525 పాఠ్యాపుస్తకాలు అవసరమని ఉన్నతాధికారులు ఇండెంట్ పెట్టారు. ఈ నెల 12న స్కూళ్ల ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్ప టికే దాదాపు 70శాతంపాఠ్యాపుస్తకాలు ఆయా మండలాలకు చేరినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన పాఠ్యాపుస్తకాలు రెండు, మూడు రోజుల్లో చేరుతాయని సంబంధిత అధికారులు తెలిపారు. విద్యా కానుకకు సంబంధించిన కిట్లు మొత్తం ఈ నెల 10 నాటికి చేరుతాయని చెప్పా రు. గతంలో పాఠశాలలు తెరచిన 2, 3 నెలల వరకు కూడా పూర్తిస్థాయిలో పుస్తకాలు అందేవి కావు.

విద్యాకానుక ఇలా...

ప్రభుత్వం అందించే జగనన్న విద్యాకానుక కిట్‌లో విద్యార్థులకు అవసరమయ్యే అన్ని వస్తువులు ఉంటాయి. బ్యాగ్, పాఠ్యాపుస్తకాలు, బూట్లు, బెల్టు, రెండు జతల సాక్స్, మూడుజతాల యూనిఫాం, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, నోటు పుస్తకాలు ఉంటాయి. గతంలో జూన్ రాగానే విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠ్యాపుస్తకాలు కొనుగోలు పెద్దసవాలుగా ఉండేది. తల్లిదండ్రుల జేబులకు భారీగా చిల్లులుపడేవి. ఇప్పుడా సమస్యే లేదు. పిల్లలను బడికి పంపితే చాలు అన్నింటినీ ప్రభుత్వమే చూసుకుంటుంది.

బాగా చదువుకుంటున్నా



ఐదవ తరగతి వరకు పసుపల ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నా. ఇప్పుడు ఇక్కడే జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చేరుతున్నా. అన్ని వసతుల బాగున్నాయి. ప్రత్యేకించి విద్యాకానుక కిట్లు బాగా ఉపయోగపడుతున్నాయి. సంతోషంగా ఉంది. దీంతో బాగా చదువుకుంటున్నా.

– పి. చరిత విద్యార్థిని, 6వ తరగతి పసుపల

పేదల విద్యాభివృద్ధే లక్ష్యంగా ప్రోత్సాహం



పేదల విద్యాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పోత్రహిస్తుంది. విద్యార్థులు, ఉపాధ్యా యులకు అనుగుణంగా వసుతులు కల్పించింది. వసతులు సౌకర్యవంతంగా ఉండడంతో విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటున్నారు. దీంతో మంచి ఫలితాలు సాధించగలుగుతున్నాం.

– కె.నాగభూషణం హెచ్ఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల బనగానపల్లె

పాఠశాలలు తెరచిన రోజే విద్యాకానుక పంపిణీ



2023–24 విద్యాసంవత్సరానికిగాను పంపిణి చేయాల్సిన జగనన్న విద్యాకానుక కిట్లు ఇప్పటికే 70 శాతం మేర మండల కేంద్రాలకు చేరాయి. మిగిలినవి అన్ని మరో మూడు రోజుల్లో చేరుతాయి. స్కూళ్లు తెరచినరోజే విద్యాకానుక కిట్లు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మొదటి రోజే పుస్తాకలు అందితే విద్యార్థుల్లో ఉత్సాహం మాటల్లో చెప్పలేనిది.

– స్వరూప, ఎంఈఓ. బనగానపల్లె మండలం

ఇన్‌చార్జ్ ఏఓగా ప్రసాదరావు

కొలిమిగుండ్ల: సాధారణ బదిలీల్లో భాగంగా కొలిమిగుండ్ల వ్యవసాయాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న పవన్‌కుమార్ వెలుగోడుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు అవుకు ఏఓగా ప్రసాదరావుకు కొలిమిగుండ్ల మండలం ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

42,005 మంది రైతులకు రైతుభరోసా

బనగానపల్లె: వైఎస్సార్ రైతుభరోసా పీఎం కిసాన్ ద్వారా నియోజకవర్గంలో 42,005 మంది రైతులకు లబ్ధి చేకూరిందని ఏఓ సుబ్బారెడ్డి తెలిపారు. రైతుల ఖాతాల్లో రూ . 23.12 కోట్లు జమ అయ్యిందన్నారు. మార్చి నుంచి మే వరకు కురిసిన అకాల వర్షాలకు నియోజక వర్గంలో 1,324 హెక్టార్లలో జరిగిన పంట నష్టానికి 1,926 మంది రైతులకు రూ.1.90 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందన్నారు. అదేవిధంగా సబ్సిడీపై నియోజకవర్గానికి సంబంధించి 38 ట్రాక్టర్లు మంజూరయ్యాయని వివరించారు.

8404 మంది రైతులకు రైతు భరోసా

సంజామల: సంజామల మండలంలో వైఎస్సార్ రైతు భరోసా 2023 సంవత్సరానికి గాను మొదటి విడత కింద 8404 మంది రైతులకు వర్తించిందని ఏఓ సుధాకర్ రెడ్డి తెలిపారు. మొదటి విడత కింద 7500 చొప్పున 8404 మంది రైతులకు వారి బ్యాంకుఖాతాల్లో రూ.6.30 కోట్లు జమ అయ్యిందన్నారు.

మట్కా బీటర్లు అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని బలపాలపల్లెలో మట్కా నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన మధు శేఖర్, అశోక్ మట్కా నిర్వహిస్తుండటంతో అదుపులోకి తీసుకుని మట్కా చీటీల తోపాటు రూ.2050 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి డోన్ కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్టు

డోన్ టౌన్ : ప్రభుత్వ పాఠశాల్లో చదివే ప్రతి విద్యార్థికి వరుసగా నాల్గవ సంవత్సరం జగనన్న విద్యా కానుక కిట్లను అందిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు, మండల విద్యాధికారి ప్రభాకర్ తెలిపారు. స్థానిక బాలికల హైస్కూల్లో భద్ర పరచిన విద్యాకానుక కిట్లను శుక్రవారం వారు పరిశీలించి మాట్లాడారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మొత్తం 77 స్కూళ్లకు సంబంధించి జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీకి సర్వం సిద్ధం చేశామన్నారు. యూనిఫామ్స్, బ్యాగ్, బెల్టు, టై, బూట్లు, పాఠ్య పుస్తకాలు, నోటు బుక్స్, డిక్షనరీలు అందించనున్నట్లు తెలిపారు.


యూనిఫామ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

యంగ్‌మూడో పోటీలలో విద్యార్థుల ప్రతిభ

బేతంచెర్ల: ఐదవ జాతీయ యంగ్‌ముడో ఫెడరేషన్ కప్ 2023 గోవాలో ఉన్న పనాజీలోని కంపెల్ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో గతనెల 26 నుంచి 28 వరకు జరిగిన యంగ్‌మూడో పోటీలలో ఏపీ తరపున అండర్ –14 బాలికలు, బాలుర విభాగంలో బేతంచెర్ల విద్యార్థులు పాల్గొన్నారు. హోరా హోరీగా సాగిన ఈ పోరులో బేతంచెర్ల విద్యార్థులు 3వ స్థానం కైవసం చేసుకొని బంగారు, వెండి, కాంస్య పథకాలు కైవసం చేసుకున్నారు. శ్రీవల్లీ రెడ్డి, లక్ష్మి ప్రణతి బంగారు, మనస్వీని, అమృత, మధు మోహన్, జాకీర్ హుస్సేన్, దీనేష్ వెండి, మనీష్ చంద్ర కాంస్య మెడల్స్ కైవసం చేసుకున్నారు. ఈసందర్భంగా మాస్టర్ వెంకటేష్, కోచ్ నాగన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం అభినందన సభ ఏర్పాటు చేసి సర్టిఫికెట్స్ అందజేసి, మెడల్స్ ప్రదానం చేశారు.


మెడల్స్ సాధించిన విద్యార్థులు

‘పది’ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

బనగానపల్లెరూరల్: మండల కేంద్రం బనగానపల్లె పట్టణంలో పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొదటి రోజు తెలుగు పరీక్షకు 19 మంది గైర్హాజరు, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 15 మంది, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 17 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రాల చీఫ్ ఆఫీసర్లు నాగభూషణం, పద్మావతమ్మ, సుబ్రహ్మణ్య తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లుగా భాస్కర్‌రెడ్డి, పుల్లయ్య ఆచారి, భుజంగరావు వ్యవహరించారు.

కొలిమిగుండ్ల: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య శుక్రవారం ప్రారంభమయ్యాయి. కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉన్నత పాఠశాలలో 150, మోడల్ స్కూల్‌లో 240 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా ఒక్కో సెంటర్ నుంచి ఒకరు చొప్పున పరీక్షకు గైర్హాజరయ్యారు.

42 మంది విద్యార్థులు గైర్హాజరు

ప్యాపిలి: స్థానిక బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్షకు 182 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 42 మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రాల చీఫ్‌లు మహబూబ్ బాషా, విజయ నిర్మల దేవి తెలిపారు.

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

బేతంచెర్ల: పట్టణంలోని పూదోట ఆశ్రమంలో శుక్రవారం ఛత్రపతి శివాజీ పట్టాభిషిక్తుడైన రోజును పురస్కరించుకుని సందర్భంగా హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్, హిందూ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ చిత్ర పటానికి పూలమాళలు వేసి నివాళులర్పించారు. ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి ఈ సందర్భంగా ఫౌండేషన్ నంద్యాల జిల్లా డివిజన్ కన్వీనర్ నాగ మోహన్‌రెడ్డి అన్నారు.

అమృత్ సరోవర్ పనుల తనిఖీ

బనగానపల్లెరూరల్: అమృత్ సరోవర్ పథకం కింద అభివృద్ధి చేసిన మండలంలోని చెరువుపల్లె, రామతీర్థం, ఎర్రగుడి, పసుపల గ్రామాల్లోని చెరువులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఉమాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారుల బృందం సభ్యులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఈ ఉమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జిలా కలెక్టర్ ఆదేశాల మేరకు అమృత్ సరోవర్ పథకం నిధులతో చెరువుల్లో ఎలాంటి పనులు చేశారు.. ఎంత నాణ్యత పాటించారు... తదితర విషయాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. డీఈఈ వెంట డ్వామా ఏపీడీ శ్రీవిద్యా, డీఆర్‌పీ అశోక్, ఏపీఎం హరికృష్ణ, ఈసీ తదితరులు పాల్గొన్నారు.

సంజామల: మండల పరిధిలోని నొస్సం గ్రా మంలో అమృత్ సరోవర్‌లో భాగంగా పనులు చేపట్టిన పెద్ద చెరువును జిల్లా వెరిఫికేషన్ బృందం సభ్యులు తనిఖీ చేశారు. పనులు జరిగిన చెరువు, ఆయకట్టు విస్తీర్ణం, చెరువు మట్టి ఎంతమంది తీసుకున్నారనే విషయాలను పరిశీలించారు. గ్రామంలో రైతులు, ఉపాధి సిబ్బందిని అడిగి పనుల పరిస్థితిపై ఆరా తీశారు. బండ్ వెంట మొక్కలు నాటించాల్సింగా సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వెరిఫికేషన్ టీం సభ్యులు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భాస్కర్ బాబు, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ సాంబశివరావు, డీఆర్‌పీ మహేష్, ఏపీఓ ప్రకాష్ రావు, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బేతంచెర్ల: గ్రామీణ ప్రాంతాలో భూగర్భజలాలు పెంపునకు ఉపాధి హామీ పథకం ద్వారా అమృత సరోవర్ ప్రాజెక్టు కింద చెరువులు, కుంటలలో పూడిక తీత పనులను నిర్వహిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఉమాకంత్ రెడ్డి, ఏపీడీ శ్రీవిద్య తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని రంగాపురం , ఆర్ బుక్కాపురం, రహిమానుపురం, ముసలాయి చెర్వు గ్రామాల్లో అమృత సరోవర్ ప్రాజెక్టులో చేపట్టిన పనులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలో భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్పీ అశోక్, ఏపీఓ శేషన్న, ఈసీ సుబ్బానాయక్, టెక్నికల్ అసిస్టెంట్స్ మోహన్, శ్రీను, ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.


ఎర్రగుడి గ్రామం అమృతసరోవర్ నిధులతో అభివృద్ధి పరచిన చెరువును పరిశీలిస్తున్న అధికారులు


పనులను పరిశీలిస్తున్న వెరిఫికేషన్ బృందం సభ్యులు

ముమ్మరంగా వాహనాల తనిఖీలు


వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న పోలీసులు

డోన్ టౌన్: పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట ఎస్ఐ న గేష్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ గోపాల్ సిబ్బందితో కలిసి శుక్రవారం సాయిత్రం ముమ్మరంగ వాహనాలను తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలు, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ తదితర వాటిని పరిశీలించారు. నిబంధనలు పాటించని వాహనచోదకులకు అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్స్ చాంద్‌బాషా,నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం

బనగానపల్లె రూరల్: మండలంలోని యనకండ్ల గ్రామంలోని శ్రీ జయజ్యోతి సిమెంట్ పరిశ్రమ ఆవరణలోని శ్రీ సీతారాముల ఆలయంలో మైహోం ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ జూపల్లి రామేశ్వర్‌రావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గత నెల 31 నుంచి నిర్వహిస్తున్న శ్రీ సీతాలక్ష్మణ హనుమత్సమేత శ్రీరామచంద్ర స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అహోబిల రామానుజ జీయర్ స్వామి, దేవనందగిరి రామానుజ జీయర్ స్వామి, వేదపండితుల మత్రోచ్ఛరణల మధ్య ఉదయం 10 గంటలకు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో శ్రీ సీతారాముల కల్యాణం కనుల పండువగా సాగింది. డాక్టర్ జూపల్లి రామేశ్వర్‌రావు, కుమారి దంపతులతో పాటు కుమారుడు సంస్థ ఎండీ రంజీత్‌రావు. జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.


సీతారాముల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

భక్తిశ్రద్ధలతో శ్రీ చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయం ఈఓ రామానుజన్ ఆధ్వర్యంలో శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి పల్లకీ సేవా కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఆలయ ఈఓ, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదం పంపిణీ చేశారు.


శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

ఈదురు గాలులకు నేలవాలిన అరటి తోటలు

ప్యాపిలి: మండల పరిధిలోని బోయవాండ్లపల్లి గ్రామంలో శుక్రవారం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఒక్క సారిగా బలమైన గాలులు వీచడంతో శివారు ప్రాంతంలోని తోటల్లో అరటి చెట్లు నేలవాలాయి. నాగేశ్వరరావు, హుసేన్‌పీరా, మధు తదితర పదిమంది రైతుల అరటి తోటలు దెబ్బతిన్నాయి. గెలలు చేతికి వస్తున్న సమయంలో ఈదురు గాలులు వీయడంతో 20 ఎకరాల్లో దాదాపు రూ. 20 లక్షల వరకు పంట నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


నేలవాలిన అరటి చెట్లు



విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

సంజామల: మండల పరిధిలోని ఆర్.లింగాలదిన్నె గ్రామంలో గురువారం గాలీవాన బీభత్సం సృష్టించడంతో సుమారు 27 కరెంటు స్థంభాలు వరిగాయి. ఈ మేరకు శుక్రవారం ఏడీ ఖాజావలి, ఏఈ శ్రీనివాసుస్ నేతృత్వంలో సిబ్బంది బాషా, దస్తగిరి, శాం నాయక్, రమణ, దస్తగిరి వరిగినవాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేశారు. వెంటనే స్పందించిన అధికారులకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం


ఆర్ కొత్తపల్లె గ్రామంలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, సర్పంచ్‌లు


అంబాపురం గ్రామంలో వలంటీర్లను సత్కరిస్తున్న దృశ్యం


వలంటీర్లను సన్మానించిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి

బేతంచెర్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కుల, మత, వర్గ భేదం లేకుండా అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడంలో వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం అని ఎంపీపీ బుగ్గన నాగ భూషణం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీకృష్ణ, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆర్ కొత్తపల్లె, అంబాపురం గ్రామాల్లో ఎంపీడీఓ వెంగన్న, గ్రామ సర్పంచ్‌లు మహాలక్ష్మి, శ్రీనివాసులు, ఎంపీటీసీలు మునేశ్వర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ, ఎంపీడీఓ వలంటీర్లకు పురస్కారాలు, మెడల్స్ అందజేసి శాలువాలతో సత్కరించారు. వారు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఎవ్వరి సిఫారసు లేకుండా గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను అందజేస్తూ సరికొత్త పాలనకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాపసాని చంద్రశేఖర్‌రెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి, రమణ, రామ నాయుడు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె: వలంటీర్ల సేవలు అమోఘమని, వారు ప్రజలకు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి కొనియాడారు. మండలంలోని పలుకూరు గ్రామ సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వలంటీర్ల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వలంటీర్లను దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులందరికీ వర్తింపజేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా పేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నందునే వలంటీర్లు అందరి మన్ననలు పొందుతున్నారని, ప్రజలకు మరింత చేరువ కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ శ్రీనివాసులు, సర్పంచ్ సుమలత, ఉపసర్పంచ్ శివకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, జాన్, సచివాలయ కన్వీనర్ వడ్డె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.